పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- మొక్కలు నాటిన డీఈవో చంద్రకళ


శొంఠ్యాం ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీలో విద్యార్థుల ర్యాలీ


వినియోగదారులకు మొక్కలు పంచుతున్న పెట్రోల్ బంక్ సిబ్బంది


జిల్లా విద్య శిక్షణ సంస్థ ఆవరణలో మొక్క నాటుతున్న డీఈవో చంద్రకళ, తదితరులు

భీమునిపట్నం : పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా విద్యాశాఖ మంత్రి ఎల్.చంద్రకళ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రానురాను పర్యావరణంలో మార్పులు వస్తుండడంతో వాతావరణంలో వేడి పెరుగుతోందని, వర్షాలు కూడా సరిగ్గా కురవడం లేదన్నారు. దీని ప్రభావం వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని, అందరి జీవన విధానం, ఆరోగ్యాలపై ప్రభావం పడుతోందన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని, దీన్ని అడ్డుకోవాలంటే మొక్కలు అధికంగా నాటడం ముఖ్యమన్నారు. దీన్ని అందరూ తమ బాధ్యతగా భావించి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని సూచించారు. తద్వారా పర్యావరణంలో మంచి మార్పులు ఏర్పడి వర్షాలు కురిస్తే సమస్యలన్నీ తీరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తగరపువలస : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను బుధవారం ఏరి వేయించి మొక్కలు నాటారు. కాలుష్య నివారణకు పచ్చని చెట్లు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఆనందపురం పంచాయతీ శ్రమజీవుల కాలనీలో ఐద్వా అధ్యక్షురాలు కె.నాగరాణి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా దేశాల్లో ఆక్సిజన్ కొరత కారణంగా అక్కడి వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో మన దేశంలో కూడా ఇలాంటి సమస్య రాకుండా విరివిగా మొక్కలు పెంచాలని కోరారు. ప్రతి వ్యక్తి ఒక్క మొక్క అయినా నాటి తమ ఇంటిలో సభ్యునిగా భావించి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు రామలక్ష్మిదేవి, డి.దేవి, ఝాన్సీ, జస్వంత్, చాణక్య రిషి, కె.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల కారణంగా అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ వాడకాన్ని తగ్గించి గుడ్డ, కాగితపు సంచులు వినియోగించాలన్నారు. మనం పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ప్రకృతి రక్షణ కల్పిస్తుందన్నారు. అలాంటి ప్రకృతిని మనం స్వార్థం కోసం ఇష్టానుసారం ధ్వంసం చేయడం తగదన్నారు. 1972లో ఐక్యరాజ్య సమితి వాతావరణంలో మార్పులను గమనిస్తూ తగు చర్యలు తీసుకునే నిమిత్తం స్వీడన్‌లో తొలిసారి పర్యావరణ పరిరక్షణ సదస్సు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమ్మాది : సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత బాల్యం నుంచే తీసుకోవాలని జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ వాడపాలెంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మైలపల్లి తినాథరావు సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. నీరు, వనరుల సంరక్షణ, పారిశుధ్యం, ఇంధన శక్తి ఆదా, వేస్టేజ్, ఆరోగ్యవంతమైన జీవనానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.


బంగ్లామెట్టపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొక్కల పంపిణీ

మధురవాడ : కొమ్మాది జంక్షన్ వద్ద ఓ పెట్రోల్ బంక్ యాజమాన్యం బుధవారం వినియోగదారులకు మొక్కలు పంచి పెట్టింది. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటడమే కాకుండా పెట్రోల్, డీజిల్ పోయించుకోవడానికి వచ్చిన వినియోగదారులకు పచ్చదనం ప్రాముఖ్యతను వివరించి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం ప్రాధాన్యతను వివరించారు.

పద్మనాభం : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈవో పొన్నగంటి రమణ సూచించారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయం, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రాంగణాలు, ప్రభుత్వ స్థలాలు, ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో శేరిఖండం సర్పంచ్ పి.చిన్నారావు, రెడ్డిపల్లి హైస్కూల్ హెచ్ఎం ఎం.సన్యాసిరావు, కేజీబీవీ ఎస్‌వో గ్రేస్ లిల్లీ, పీటీఐలు, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆనందపురం శ్రమజీవుల కాలనీలో మొక్క నాటుతున్న ఐద్వా ప్రతినిధులు


పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు త్రినాథరావు


పద్మనాభం కస్తూర్బాలో మొక్క నాటుతున్న ఎంఈవో రమణ



రెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

పుష్కరఘాట్ నిర్మాణానికి దివీస్ సాయం రూ.12.85 లక్షలు


పుష్కరఘాట్ నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా ప్రజాప్రతినిధులు, దివీస్ సిబ్బంది

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గోస్తనీ నది వద్ద పుష్కరఘాట్ అదనపు నిర్మాణం, మరమ్మతులకు దివీస్ లేబొరేటరీ రూ.12,85,626 ఖర్చు చేయనుంది. దీనికోసం బుధవారం సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నిర్మించిన పుష్కరఘాట్ కొన్ని చోట్ల మరమ్మతులకు గురైందన్నారు. దీనికి మరమ్మతులతోపాటు అదనంగా మెట్లు, ప్రహరీ, లైట్లు, రెయిలింగ్, దుస్తులు మార్చుకునే గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘాట్ వల్ల వివిధ పుణ్య కాలాలతోపాటు కార్తీకమాసంలో నదిలో స్నానాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుత్తమ్మతల్లి మారువారం ఉత్సవం


చిప్పాడ సుత్తమ్మతల్లి


తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ, మూలకుద్దు గ్రామదేవత సుత్తమ్మతల్లి మారువారం ఉత్సవం బుధవారం ఆయా ఆలయాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేషంగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఆలయ ప్రాంగణాల వద్ద భక్తులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సామూహిక పూజలు, అభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

తీరం అల్లకల్లోలం


మంగమారిపేట బీచ్ వద్ద ఎగసిపడుతున్న కెరటాలు

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతం బుధవారం సాయంత్రం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారింది. చినుకులతో ప్రారంభమై ఈదురు గాలులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రుషికొండ, సాగర్‌నగర్, మంగమారిపేట తీర ప్రాంతాల్లో ఉధృతంగా అలలు ఎగసిపడ్డాయి. రుషికొండ తీర ప్రాంతంలో అలలు ఎగసిపడుతున్న నేపథ్యంలో పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు.

డ్రైనేజీలపై శ్లాబులు శిథిలం


చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం పక్కన డ్రైనేజీపై శిథిలమైన శ్లాబు


చావుల మదుము రహదారిలో కార్మికవాడ వద్ద...

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో పలుచోట్ల డ్రైనేజీలను దాటడానికి వేసిన శ్లాబులు శిథిలమై ప్రమాదకరంగా ఇనుప చువ్వలు బయటకొచ్చేశాయి. మరికొన్ని చోట్ల కాంక్రీట్ వదిలి గోతుల మయంగా మారుతున్నాయి. గతంలో వీటిని నిర్మించిన కాంట్రాక్టర్లు కక్కుర్తితో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో శిథిల స్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం డ్రైనేజీలు దాటేవారి పాలిట ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఇనుప చువ్వలతోపాటు నాణ్యమైన సిమెంట్ వినియోగించకపోవడం వల్లే ఇలా జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇనుపచువ్వల మొనలు వాహనాలకు, నడిచేవారి కాలికి గుచ్చుకుంటూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. జీవీఎంసీ పరిధిలో డ్రైనేజీలు నిర్మించి శ్లాబులు వేసిన ప్రతీ చోటా ఈ సమస్య కనిపిస్తోంది. ముఖ్యంగా కొండపేట, చిట్టివలస, రామన్నపేట, బాలాజీనగర్, బంగ్లామెట్ట, శ్రీనగర్, చిల్లపేట, నమ్మివానిపేట, సంగివలస, సంతపేట, ఇడదాసరిపేట, వలందపేట, ఉప్పాడపేట గ్రామాల్లో ఇలాంటి శ్లాబులు ఉన్నాయి. ఇవి పూర్తిగా శిథిలం కాకముందే వీటికి జీవీఎంసీ మరమ్మతులు చేయించి వినియోగానికి అనుకూలంగా తయారు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

హైవే డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

తగరపువలస : జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డ్రైనేజీలు పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ బాటిళ్లతో పూడుకుపోయాయి. దీంతో వర్షాల సమయంలో కురిసిన వరద నీరు, మురుగు డ్రైనేజీలో నుంచి కాకుండా సర్వీస్ రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ సమయంలో లోపాల కారణంగా ఇప్పటికీ ఈ డ్రైనేజీలు పూర్తిగా వినియోగంలోకి రావడం లేదు. అప్పట్లో నిర్మాణ సమయంలో డ్రైనేజీపై సిమెంట్ పలకలు కాకుండా ఏకంగా శ్లాబు నిర్మించారు. ఆ సమయంలోనే డ్రైనేజీ లోపల డెబ్రిస్, ఫ్లైయాష్ బూడిద వంటివి ఉండిపోయాయి. వీటిని పూర్తిగా తొలగించాల్సి ఉన్నా తొలగించకపోవడంతో వర్షాకాలంలో వ్యర్థాలు ఒకచోటకు వచ్చి అడ్డంగా ఉండిపోతున్నాయి. వీటిని పూర్తిగా తొలగించి డ్రైనేజీలను క్లియర్ చేయాలని పలువురు కోరుతున్నారు.


ఆదర్శనగర్ వద్ద హైవే డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

అరుదైన వృక్ష జాతుల నిలయం

- జీవ వైవిధ్య ఉద్యానవనంలో పుష్పాల కనువిందు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు


ముళ్ల మొక్కపై పుష్పాల కనువిందు


ఉద్యానవనంలో వికసించిన పుష్పాలు

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక జీవ వైవిధ్య ఉద్యానవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని సరిగ్గా 22 సంవత్సరాల క్రితం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ప్రారంభించామని నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ నేచర్స్ కన్జర్వేషన్ క్లబ్, యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కాలేజ్ ఫర్ విమెన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. 100 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఔషధ మొక్కలను ఉద్యానవనం ప్రాంగణంలో నాటారు. మూడెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ఉద్యానవనంలో మూడు వేలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. నేల మీద, నీటిలో, చెట్లపైన జీవించే మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. ఎడారిలో మాత్రమే పెరిగే ముళ్ల మొక్కలు సైతం వందలాదిగా ఇక్కడ మనంకు దర్శనమిస్తాయి.


విరబూసిన మే ఫ్లవర్

రెడ్డిపల్లి హైస్కూల్‌కు రూ.50 వేల విరాళం


హైస్కూల్ హెచ్ఎం సన్యాసిరావుకు రూ.50వేలు అందజేస్తున్న సర్పంచ్ చిన్నారావు

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గది గోడలపై దేశ నాయకుల చిత్రాలు వేసినందుకు పల్లంటి విశ్వేశ్వర కుమార్ తన సొంత నిధులు రూ.50 వేలు వితరణగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు బుధవారం పాఠశాలలో హెచ్ఎం ముద్రగడ సన్యాసిరావుకు అందజేశారు. గాంధీజీ, అంబేడ్కర్, తదితర దేశ నాయకుల బొమ్మలను చిత్రకారుడు మజ్జి గౌరి చిత్రీకరించారు. ఇవి అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో పొన్నగంటి రమణ పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత భీమిలిలోని క్యాంపు కార్యాలయానికి బుధవారం ఆయన తొలిసారిగా విచ్చేశారు. తొలుత తనతోపాటు విశాఖ పరిధిలో టీడీపీ అభ్యర్థులంతా గెలవడంతో కేకులు కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఇంత భారీ మెజారిటీతో గెలిపించుకున్న ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. అలాగే పార్టీలోని ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం ఎంతో కృషి చేశారన్నారు. రాబోయే రోజుల్లో తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా అన్ని విధాలుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సమస్యలు పరిష్కరిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లాక్ టవర్ పనులు పరిశీలించిన కమిషనర్


లేపాక్షి జంక్షన్ వద్ద సర్కిల్ నిర్మాణంపై సూచనలు చేస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్ : నగర సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో నిర్మిస్తున్న క్లాక్ టవర్ పనులు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కూడళ్ల అభివృద్ధిలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఆకర్షణీయమైన క్లాక్ టవర్ నిర్మిస్తున్నామన్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగదాంబ జంక్షన్ రోడ్డు సెంటర్ మీడియన్‌లో ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా చేసి ఆకర్షణీయమైన మొక్కలు నాటాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. లేపాక్షి జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా సర్కిల్ నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతోపాటు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బిందెలతో పసుపు నీళ్లు తీసుకెళ్లి అభిషేకం చేశారు. ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి కూడా అమ్మవారికి గంధం నీటితో అభిషేకాలు చేశారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం


దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఊపిరి ఉన్నంత వరకు కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఎం.రామారావు, డీసీహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్మికుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే కార్మికులతో పాటు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా 1210వ రోజు, బుధవారం శిబిరంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు గుణపాఠం నేర్పారన్నారు. ఆరోగ్యకరంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకుంటే ఎవరికైనా ఇదే గతి పడుతుందన్నారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.